

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 19 నవంబర్ 2025 పేజీలు : 04

# సర్వం సాయి మయం

## -అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా "సత్యసాయి రథోత్సవం"

## - హాజరైన మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్య నాయుడు, మంత్రులు, ప్రముఖులు

శ్రీ సత్యసాయి జిల్లా, నవంబర్ 17, ప్రభాతవార్త ప్రతినిధి:

భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవాలలో భాగంగా పుట్టపర్తి పుర వీధులు సర్వం సాయి మయంగా మారాయి. వీధి వీధిన సత్య సాయి నామస్మరణతో ఆశేష జనవాహిని మధ్య "సత్యసాయి రథోత్సవం" అంగరంగ వైభవంగా అద్భుత ఆధ్యా త్మిక భావనతో జరిగింది. భక్తుల హృదయాలను హత్తుకొనే స్వామి వారి కీర్తనలతో గతంలో కంటే భిన్నంగా వేణుగోపాల స్వామి రథోత్సవం స్థానంలో సత్యసాయి రథోత్సవాన్ని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వర్గాలు నిర్వహించాయి. వేద పండితుల వేద పఠనంతో మంగళవారం ఉదయం నుండే సాయినామ స్మరణలు, వివిధ కళారూపాల ప్రదర్శనలతో ఆధ్యాత్మికత శోభతో పుట్టపర్తి పుర వీధులు పులకించాయి. భానుడి ఉదయపు కిరణాలు తాకగానే పెద్దవెంకమరాజు కళ్యాణ మండపం వద్ద రథోత్సవం వైభవోపేతంగా ముం దుకు కదిలింది. సత్యసాయి రథోత్సవాన్ని పురస్కరించుకొని నూతనంగా తయారు చేసిన వెండి రథం కళాకృతులు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా రథం పైభాగంలో గోపురాకార శిరస్సు, చుట్టూ స్వామి వారి జీవన సందేశా లను స్మరింపజేసే శిల్పాలు, గంటల అలంకరణలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్న శ్రీసత్యసాయి రథం యొక్క పసిడి కాంతుల తేజస్సు చూస్తూ భక్తులు తమను తాము మైమరచి పోయారు. తొలుత జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సత్యసాయి నూతన రథాన్ని రిమోట్ సహాయంతో ప్రారం భించగా, పెద్దఎత్తున రంగురంగుల బాణాసంచా పేల్చి కొలాహలం మధ్య భక్తులకు తిలిసారిగా రథం దర్శనం కల్పించారు. శ్రీసత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్, ఆయన సతీమణి హిమవాహిని ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవితమ్మ, సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, ట్రస్ట్ సభ్యులు నాగనంద, స్థానిక శాసనసభ్యులు సింధూరరెడ్డి, పరిటాల సునీతమ్మ, మాజీమంత్రిపల్లె రఘునాథ్ రెడ్డి, స్వచ్ఛందకార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్, సినీ నటుడు మురళీమోహన్, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి తదితర ప్రముకులు పాల్గొన్ని బాబా పసిడి విగ్రహం, వెండి రథం, ఆధ్యాత్మిక కళాప్రదర్శనలను ప్రత్యక్షంగా వీక్షించి మధురానుభూతి చెందారు. ప్రత్యేక డ్రోన్‌ల ద్వారా సత్యసాయి రథోత్సవం సందర్భంగా పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయంలో 1,100 మంది దంపతులు భక్తిశ్రద్ధలతో శ్రీ సాయి సత్యనారాయణ వ్రతంను అత్యంత భక్తి ప్రపత్తులతో ఆచరించారు.





రథాన్ని లాగుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఆర్‌జె.రత్నాకర్, మంత్రులు సత్యప్రసాద్

సత్యసాయి రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆర్‌జె.రత్నాకర్ దంపతులు

### సాయివిగ్రహ దర్శనానికి ఎగబడిన భక్తకోటి

నూతన రథం ప్రశాంతి నిలయం ఉత్తర గోపుర ద్వారం వద్దకు చేరుకోగానే ప్రత్యేకంగా తయారు చేయించిన భగవాన్ సత్యసాయి పసిడి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచుతున్న వేళ భక్తులు సంభ్రమాశ్చర్యాలతో వీక్షించాలన్నఆకాంక్షతో భారీ సంఖ్యలో ఎగబడ్డారు. రథోత్సవానికి ముందు భాగంలో వేణుగోపాల స్వామి, సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి, ధర్మస్వరూప సత్యసాయి సారాన్ని చాటుతూ శతాధిక వేదపండితులు, విద్యార్థులు, సేవాదల్ సభ్యులు రథాన్ని లాగుతుండగా, సత్యసాయి నామస్మరణతో వేదమంత్రిల మధ్య రథోత్సవం కదిలింది. భక్తులు భక్తి పారవశ్యంతో రథాని ్న లాగుతూ తన్మయత్వం చెందారు. శతజయంతి వేడుకలు ప్రపంచవ్యాప్తంగా సత్యసాయి సందేశాలను నూతనంగా వెలిబుచ్చేలా ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. తిరునాళ్ళను తలపిస్తూకోలాటాలు, భజనలు, నృత్యాలతో, చెక్కభజన బృ ందాల ఉత్సాహవంతమైన వాయిద్యాలు, కోలాటాల విన్యాసాలు,చిన్నారుల సాంస్క ృతిక నృత్యాలు, కోయడాన్స్ ప్రత్యేక ప్రదర్శనలుఊరేగింపు ప్రారంభం నుండి ముగింపు వరకు వివిధ కళాకారులు రెట్టింపు ఉత్సాహంతో ప్రదర్శనలు నిర్వహిస్తూ భక్తకోటిని ఉర్రూతలూగించారు. ఈ కళాప్రదర్శనలు భక్తులను అలరించడమే కాకుండా, భారతీయ సంప్రదాయాలను ప్రతిబింబించే అద్భుత దృశ్యాలను సృష్టించాయి. కాగా కొంత మంది వయో వృద్ధులు సైతం సేవాదళం సహకారంతో రథాన్ని లాగుతూ భగవాన్ సత్యసాయి బాబా పట్ల తమకు ఉన్న భక్తిపారవశ్యాన్ని చాటుకున్నారు.

# ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రుల బృందం



పుట్టపర్తి (కలెక్టరేట్), నవంబర్ 18, ప్రభాతవార్త

భగవాన్ శ్రీ సత్యసాయి జయంతి ఉత్సవాలలో భాగంగా ఈనెల 19న బుధవారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచ్చేయుచున్న సందర్భంగా మంగళవారం పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియం లో ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక పనులను జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్,ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు సత్య కుమార్ యాదవ్,వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మాత్యులు సవితమ్మ, లు పరిశీలించారు. రాష్ట్ర మంత్రులకు హిల్ వ్యూ స్టేడియంలో జరుగుతున్న పనుల పురోగతిపై రాష్ట్ర నోడల్ అధికారులు యం.టి. కృష్ణ బాబు, జి.వీర పాండియన్, జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి,డిఐజి షిమోషి భాజ్పై, ఆర్డీవోలు మహేష్, సువర్ణ, వివిఎస్ శర్మ, ట్రస్టు సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రుల బృందం




## శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో నేడు పుట్టపర్తి కి ప్రధాని నరేంద్ర మోదీ రాక

### సత్యసాయిబాబా సమాధి సందర్శన ప్రత్యేక నాణెం, పోస్టల్ స్టాంప్ విడుదల పుట్టపర్తి కి చేరుకున్న సీఎం, డిప్యూటీ సీఎం ఇతర నేతలు



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

అనంతపురం, నవంబర్ 18, (ప్రభాతవార్త బ్యూరో)

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి (శత జయంతి) వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబర్ 19వ తేదీన పుట్టపర్తిలో పర్యటించనున్నారు. దేశం నలుమూలల నుండి, విదేశాల నుండి వచ్చిన వేలాది మంది భక్తుల సమక్షంలో పుట్టపర్తి హిల్ వ్యూ స్టేడియం లో జరిగే ఈ చారిత్రక వేడుకల్లో ప్రధాని పాల్గొననున్నారు. పుట్టపర్తి విమానాశ్రయంలో ప్రధాని నరేంద్ర మోడీకి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్ , ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,తదితర మంత్రులు, ఎంపీ లు, ఎమ్మెల్యేలు, శ్రీ సత్య సాయి సెంటర్ ట్రస్ట్ తరపున రత్నాకర్, తదితర ప్రతినిధులు స్వాగతం పలుకుతున్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఉదయం 10 గంటల ప్రాం తంలో పుట్టపర్తి చేరుకొని, ముందుగా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి పవిత్ర మహాసమాధిని దర్శించుకొని నివాళులర్పిస్తారు. తదనంతరం శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 19 తేదీన ఉదయం 10:30 గంటలకు పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో జరిగే శత జయంతి ఉత్సవాల ప్రధాన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులు, భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి బాబా వారి జీవితం, బోధనలు , ఆయన వారసత్వాన్ని గౌరవిస్తూ ..100 (వంద రూపాయల) స్మారక నాణెం , ప్రత్యేక పోస్టల్ స్టాంపు సెట్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విడుదల చేయనున్నారు. ఈ మహ త్తర సందర్భాన్ని పురస్కరించుకుని భక్తులు, ప్రముఖులు సభకు హాజరైన వారిని ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. కోయంబత్తూర్ కు ప్రధాని మోదీ..... పుట్టపర్తిలో కార్యక్రమాలు ముగిసిన అనంతరం ప్రధానమంత్రి తమిళనాడులోని కోయంబత్తూరుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1:30 గంటలకు నిర్వహించే దక్షిణ భారత సహజ వ్యవసాయ సదస్సును ఆయన అధికారికంగా ప్రారంభిస్తారు.ఈ వేదికపై ప్రధానమంత్రి పి ఏం ప్రధాన మంత్రి యోజన 21వ విడతను విడుదల చేస్తారు, దీని ద్వారా దేశవ్యాప్తంగా 9 కోట్ల మంది రైతులకు రు.18,000 కోట్లకు పైగా నిధులు పంపిణీ చేయబడతాయి. ఈ సందర్భంగా కూడా ప్రధానమంత్రి రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. కోయంబత్తూరు సదస్సు లక్ష్యం - సహజ వ్యవసాయం ప్రోత్సాహం 2025 నవంబర్ 19 ( మిగతా 4లో...)

## తాడిపత్రిలో మెగా ఎండి కృష్ణారెడ్డి బుగ్గ రామలింగేశ్వర స్వామి గుడిలో ప్రత్యేక పూజలు







అనంతపురం, నవంబర్ 18, (ప్రభాతవార్త బ్యూరో)

అనంతపురం జిల్లా తాడిపత్రిలో వెలసిన బుగ్గ రామలింగేశ్వర స్వామిని ప్రముఖ నిర్మాణ సంస్థ అయిన మెగా ఇంజనీరింగ్ సంస్థ (మెయిల్ )మేనేజింగ్ డైరెక్టర్ మెగా కృష్ణారెడ్డి మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా తెలుగు దేశం నాయకుడు జెసి పవన్ రెడ్డి , ప్రముఖ పారిశ్రామికవేత్త విష్ణువర్ధన్ రెడ్డి , తాడిపత్రి శాసనసభ సభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి తదితరులు బుగ్గ రామలింగేశ్వర స్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేసిన వారిలో ఉన్నారు. మెగా సంస్థ ఎండి మెగా కృష్ణారెడ్డి తాడపత్రి కి వచ్చిన సందర్భంగా తాడిపత్రి ఎమ్మెల్యే జేసి అస్మిత్ రెడ్డి దగ్గరుండి అతిథి మర్యాదలు చేశారు..









## తాడిపత్రి రూరల్ చుట్టూ సతీష్ సంబంధిత కేసులు

### : తాడిపత్రిలో కారుమూరి వెంకటరెడ్డిపై కేసు నమోదు
### : తాడిపత్రి పోలీసుల అదుపులో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి
### : కారుమూరి వెంకటరెడ్డిపై చింబిలి ప్రసాద్ నాయుడు ఫిర్యాదు



పోలీసుల అదుపులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డి

తాడిపత్రి, నవంబరు18, ప్రభాతవార్తః తాడిపత్రి రూరల్ పోలీసు స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డిపై సోమవారం రాత్రి కేసు నమోదైంది. తిరుమల పరకామణి చోరీ కేసులో కీలక అధికారిగా ఉన్న సతీష్ కుమార్ హత్య కేసు విషయంలో ప్రజా శాంతికి భంగం కలిగించేలా, కూటమి ప్రభుత్వ పరువుకు భంగం కలిగేలా సామాజిక మాధ్యమాలు వేదికగా మాట్లాడారని కారుమూరి వెంకటరెడ్డిపై తాడిపత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. తాడిపత్రిలోని గన్నెవారిపల్లికి చెందిన చింబిలి ప్రసాద్ నాయుడు ఫిర్యాదు మేరకు కారుమూరి వెంకటరెడ్డిపై 352, 353(1), 353(2) 196(1) వంటి సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసిన తాడిపత్రి పోలీసులు ఆయనను మంగళవారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు.

తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక పోలీసు బృందం వెంకటరెడ్డిని హైదారాబాద్ నుంచి గుంతకల్లులోని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. తాడిపత్రిలో భద్రతా కారణాల దృష్ట్యా వెంకటరెడ్డిని గుంతకల్లుకు తరలించినట్లు తెలుస్తోంది.

బుధవారం ఆయనను కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలుస్తోంది. గత అయిదు రోజులుగా ఈ రెండు కేసుల చుట్టూ తాడిపత్రి రూరల్ పోలీసులు తిరుగుతున్నారు. ఈ నెల 14న జరిగిన తిరుమల పూర్వ ఏవిఎస్‌వో యాలాటి సతీష్ కుమార్ హత్య కేసు నమోదైనప్పటి నుంచి తాడిపత్రి పోలీసులు తమ పూర్తి శక్తి యుక్తులు ఈ కేసు మీదనే ప్రయోగిస్తున్నారు. రెండు రోజులు ఉన్నతాధికారుల పర్యవేక్షణ, సమీక్ష, రెండు రోజులు డమ్మీ ఆకారా(బొమ్మ)లతో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చర్యలపై పూర్తిగా నిమగ్నమయ్యారు. ఇంతలో సోమవారం వైఎస్సారీసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిపై కేసు నమోదు చేయాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్(ఎక్స్), ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలు వేదికగా సతీష్ మృతి విషయంలో కారుమూరి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించేవిగానూ, ప్రజలను తప్పుదోవ పట్టించి అశాంతిని రేకెత్తించేవిగానూ ఉన్నాయని, వాటిని సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని చింబిలి ప్రసాద్‌నాయుడు అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడం, కేసు నమోదు చేసి వెంకటరెడ్డిని అదుపులోకి తీసుకోవడం చకచక జరిగిపోయాయి. ఈ కేసులో కారుమూరి వెంకటరెడ్డిని మొదటి నిందితునిగా, జగనన్న కనెక్ట్స్‌ను రెండో నిందితునిగా పేర్కొనడం గమనార్హం.




02ATP27_02ATP27.qxd 18-11-2025 PM 10:27 Page 1



## మృతుని కుటుంబానికి ఇన్సూరెన్స్ అందిస్తున్న కన్వీనర్

**బ్రహ్మసముద్రం నవంబర్ 18 ప్రభాతవార్త**

బ్రహ్మసముద్రం మండలం ఎర్రడికేర గ్రామానికి చెందిన శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త తెలుగుదేశం పార్టీ తరఫున సభ్యత్వం నమోదు చేసుకున్న శ్రీకాంత్ భార్య రూపకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పొందిన శ్రీకాంత్ కు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పాల బండ్ల శ్రీరాములు శ్రీకాంత్ భార్య రూపకు 5 లక్షల రూపాయలకు సంబంధించిన పత్రాన్ని అందించి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏరాడికేరా గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఎంతో ప్రాముఖ్యం



గ్రంథాలయం ఆధ్వర్యంలో వ్యాసరచన పోట

**కనేకలు నవంబర్ 18 ప్రభాతవార్త**

జిల్లా గ్రంథాలయ సంస్థ, అనంతపురం అద్వర్యం లో నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు లో భాగంగా కణేకల్ గ్రంథాలయ అధికారి మల్లికార్జున అద్వర్యం లో స్థానిక జెడ్. పి. హెచ్. బాలికల పాఠశాల నందు వ్యాసరచన మరియు చిత్రాలేఖనం పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు ఈ రకమైన వ్యాస పోటీలు నిర్వహించడం ద్వారా వాళ్లలో పోటీతత్వం పెరుగుతుంది అని, బాల్యదశ నుండే ఇటువంటి పోటీలలో పాల్గొనేటట్టు ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని తెలియజేసారు. అలాగే డ్రాయింగ్ అనేది చేతికంటి సమన్వయం, విశ్లేషణాత్మక నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచన మెరుగుపరచడంలో ఉపయోగపడుతుంది అని తెలియజేసారు. అలాగే ఎలిమెంటరీ పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులకి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి. మల్లికార్జున, జెడ్పిహెచ్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున రావు ఉపాధ్యాయులు రమేష్ , నాగమణి ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగనాథ్ ఉపాధ్యాయులు శ్రీకాంతం రెడ్డి ఇనాయతుల్ల రమేష్ వాని జెస్. పి. హెచ్. బాలికల పాఠశాల మరియు ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన కన్వీనర్ వన్నా రెడ్డి ని సన్మానించిన తెదేపా నాయకులు



వన్నారెడ్డి సుదర్శని సన్మానిస్తున్న తెదేపా నాయకులు

**కనేకల్లు నవంబర్ 18 ప్రభాతవార్తకనేకల్ :**

తెలుగుదేశం పార్టీ మండల నూతన కన్వీనర్ గా బాధ్యతలు తీసుకున్న యర్రగుంట అక్కిరెడ్డి గారి వన్నారెడ్డి ని, మరియు కనేకల్ మండలం మాజీ కన్వీనర్ కలేకుర్తి సుదర్శన్ ని బ్రహ్మసముద్రం గ్రామం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కన్వీనర్ వన్నారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధిష్టానం మరియు రాయదుర్గం శాసనసభ్యులు ప్రభుత్వ విప్పు కాలువ శ్రీనివాసులు నా మీద నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతను అప్పచెప్పినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మసముద్రం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## విగ్రహావిష్కరణకు విచ్చేసిన అతిరథ మహారథులందరికీ ధన్యవాదములు

**సోమందేపల్లి నవంబర్ 18 ప్రభాతవా ర్త**

మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ రథసారధి, రాష్ట్ర మంత్రి సవితమ్మ ఆధ్వర్యం లో లెజెండరీ యాక్టర్, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ దివంగత నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం తక్కువ సమయంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ప్రోగ్రాం చాలా అత్యద్భుతంగా జరగడం మండలం లోని విదీతి కూటమి ,కార్యకర్తలు, క్లస్టర్,యూనిట్, బూత్ఇంచార్జీలు,స్టోర్ డీలర్లు,వితీరీ అభిమానులు, యానిమెటర్లు, నాయకులకు , ప్రజలకు టిడిపి మండల కన్వీనర్ వెంకటేష్ కృతజ్ఞతలు. తెలియజేశారు ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ కార్యక్రమం దిగ్విజయం కావడానికి సహకరించిన పోలీస్ సిబ్బంది కి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారికి ప్రత్యేక ధన్యవాదములు. తెలిపారు.....

## నేడు మండలానికి ఎంఎల్ఏ, మాజీ ఎంఎల్సీ రాక

**గుడిబండ నవంబర్ 18 ప్రభాతవార్త**



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాసమూర్తి

నేడు బుధవారం మడకశిర ఎంఎల్ఏ ఎంఎస్ రాజు, మాజీ ఎంఎల్సీ గుండుమల తిప్పేస్వామి మండల పరిధిలోని దేవరహట్టి గ్రామంలోని చిత్రశేఖర్ పొలంలో ఏర్పాటు చేసిన పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి హాజరవుతున్నారని కావున మండలంలోని రైతులు,తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి కోరారు. తదనంతరం కార్యక్రమం నిర్వహించే ప్రదేశాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు లక్ష్మీనరసప్ప,సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, డైరెక్టర్ ప్రకాష్, , ప్రధానకార్యదర్శి శ్రీనాథ్ మూర్తి, ఎంపిటిసి వనజా శశిధర్, లాయర్ శివకుమార్,తెదేపా క్లస్టర్ ఇంచార్జీ చిత్రశేఖర్, మాజీ ఎంపిటిసి వెంకటేష్ మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన ఎంపీడీవో ఎ. వెంకటాచలపతికి సన్మానం.

**కనగానపల్లి నవంబర్ 18 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు మంగళవారం నూతన ఎంపీడీవో ఎ. వెంకటాచలపతిని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆయనకు శాలువా కప్పి బొకేతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, రఘురామిరెడ్డి, జయచంద్ర, పసుపుల కరుణాకర్, చిట్టెమ్మ, మనోహర్, భాను చంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ మీనా, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వైకాపాఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కు హెచ్ కె ఆర్ బృందం సన్మానం



సన్మానం చేస్తున్న దృశ్యం

**అమరాపురం నవంబర్ 18 ప్రభాతవార్త**

మండల పరిధిలోని కె శివరం పంచాయతీ పేలుబండ గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు బసవరాజుకు వైకాపా జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక సభ్యునిగా పార్టీలో పదవి కేటాయించడం తో రాష్ట్ర వైకాపా బీసీ విభాగపు ఉపాధ్యక్షుడు హాలుకూరు కాంత రాజు సమక్షంలో వైకాపా యువ నాయకులు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. బెంగళూరులో హెచ్ కె ఆర్ నివాసంలో సన్మానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి శాలువపూలమాలలతోసన్మానించారు. వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి ఆశయ సాధన కోసం కృషి చేయడంతో పాటు ఎల్లవేళలా హెచ్ కె ఆర్ అభిమానిగా ఆయన వెంటే నడుస్తానని తనకు జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక సభ్యుడిగా నియామకానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా పేలుబండ బసవరాజ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా యువ నాయకుడువార్డ్ మెంబర్ పేలుబండ మల్లికార్జున, గౌడనకుంట మంజునాథ్ , చేతన్ కుమార్, పి.శివరంటీ.రంగనాథ్, రంగనాథ్, మారుతీ ప్రసాద్, చిదు, ఆరోనపల్లి మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు, నిద్రగట్ట ప్రసన్న , పేలుబండ చంద్రశేఖర్ , పవన్ , సిద్దేశ్వర, తదితర వైకాపా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం సమానత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలి



డిప్యూటీ తాసిల్దార్ కు వినతిపత్రం ఇస్తున్న సిపిఐ నాయకులు

**సోమందేపల్లి నవంబర్ 18 ప్రభాతవార్త**

సామాజిక న్యాయం, సమానత్వం,ఆత్మగౌరం కోసం దళిత గిరిజన మైనార్టీలపై దాడులను ఖండిస్తూ జనగణలో కుల గణన చేపట్టాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల ఉప తాసిల్దార్ రెడ్డి శేఖర్ కి వినతి పత్రం అందజేశారు దేశంలో సామాజిక న్యాయం సమానత్వ సాధన ఆత్మగౌరం కోసం దేశవ్యాప్త ఆందోళన చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ సమితి పిలుపునిచ్చింది , కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారం ను చేపట్టి 11 ఏళ్ల కాలంలో దళిత గిరిజన మైనార్టీ వర్గాలపై దాడులు మితిమీరిపోతున్నాయి దేశంలో మతోన్మాద పాలన సాగుతుంది అణిచివేత అంటిరానితనం కులమత వివక్షత హింస పెట్రేగిపోతున్నాయి ఆర్ఎస్ఎస్ సంఘ పరివార్ కను సన్నలలో భారత రాజ్యాంగ లౌకిక ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తున్నారు రాజ్యాంగం కల్పించిన మానవ హక్కుల సామాజిక న్యాయం సమానత్వం ఎక్కడ అమలు కాలేదు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2023 నివేదిక ప్రకారం షెడ్యూల్ కులాలు ఎస్సీ వారిపై జరిగిన నేరాలకు 57,789 కేసులు షెడ్యూల్ తెగులు ఎస్టీ వారి పైన జరిగిన నేరాలకు 12,960 కేసులు నమోదవుగా మహిళలపై 4, 48 లక్షలు నేరాలు నమోదవడం విచారకరం ఈ ఘోరాలు ప్రతి ఏటా పెరగడం ఆందోళనకరణం ఇటీవల భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గ వా య్ పై సనాతవాది దాడికి పాల్పడిన ఘటన ఒక మచ్చుతునక మాత్రమే మోడీ పాలనలో ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు రక్షణ ప్రశ్నార్థకమైంది అనిగారణ వర్గాల హక్కులు హరించబడుతున్నాయి ప్రశ్నించే వారిపై మతోన్మాదులు దాడులకు హత్యలకు తెగబడుతున్నారు గిరిజనుల పట్టుకొట్టేలా అడవి బిడ్డల హక్కులను హరించేలా అడవులను సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టేందుకు పాలకుల కుట్రలు కుయత్తులు పడుతున్నారు ఈ విధానాలు సమాజానికి దేశానికి అత్యంత ప్రమాదకరంగా పరిమించుతాయి మన రాష్ట్రంలో దాదాపు 143 వెనుకబడిన కులాలు ఉన్నాయి గత స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వలన వేల సంఖ్యలో స్థానిక సంస్థలకు చెందిన పదవులు బీసీలు కోల్పోయారు తెలంగాణలో ప్రభుత్వం జనాభా లెక్కల సందర్భంగా కులగనన చేపట్టి అందుకు అనుగుణంగా ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీ రెండు బిల్లులు ఆమోదించింది, అదేవిధంగా మన ఆంధ్రప్రదేశ్లో కూడా జనగణలో కులగన చేపట్టి కులాల ప్రాతపదికన బీసీలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని సిపిఐ డిమాండ్ చేస్తుంది ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలస్వామి, సిపిఐ మండల కార్యదర్శి రాజగోపాల్ యాదవ్, సహాయ కార్యదర్శిలు, ఎస్ చాంద్ బాషా, అంజనమ్మ, చేనేత కార్మిక సంఘం నాయకులు షీలా నారాయణస్వామి, గంగరాజు, శ్రీకాంత్, చంద్రశేఖర్, బాబాజాన్ మహిళా నాయకురాలు, నూర్జాన్ తదితరులు పాల్గొన్నారు......

## ముఖ్య అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతుల ప్రధానం



కార్తీక వనభోజనాలు కార్యక్రమంలో శాస్త్రీయ నృత్యం చేస్తున్న అమ్మ తొలి దైవం సంస్థ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

**ఉరవకొండ, నవంబర్ 18 ప్రభాతవార్త**

ఉరవకొండ పట్టణానికి చెందిన అమ్మ తొలిదైవం సాంస్క ృతిక, సామాజిక, స్వచ్ఛంద సేవా సంస్థ విద్యార్థులు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. జిల్లా కేంద్రం అనంతపురంలోని గొంగడి రామప్ప ఫంక్షన్ హాల్ లో మంగళవారం జరిగిన వీరశైవ లింగాయత్ ఆత్మీయ సమ్మేళనం, కార్తీక వనభోజనాల కార్యక్రమంలో అమ్మ తొలిదైవం సంస్థ విద్యార్థులు పాల్గొని చేసిన నృత్యం ఆహుతులను అలరించింది. ఈ కార్యక్రమానికి ఉరవకొండ గవిమఠ సంస్థానం ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవ రాజేంద్ర మహాస్వామి, వీరశైవ కార్పొరేషన్ చైర్ పర్సన్ స్వప్న, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఉరవకొండలో అమ్మ తొలి దైవం అనే సంస్థను స్థాపించి పాటిల్ రాజశేఖర్ మరుగున పడుతున్న భారతీయ సాంప్రదాయ శాస్త్రీయ నృత్యాలకు జీవం పోస్తున్నారని కొనియాడారు. నృత్యం చేసిన సంస్థ విద్యార్థులకు వారు ప్రోత్సాహక బహుమతులు, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ తొలి దైవం సంస్థ వ్యవస్థాపకులు, పోలీస్ కమ్యూనికేషన్స్ ఎస్సై పాటిల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతో ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పిద్దాం.. ఎంపీడీవో



శిక్షణా తరగతులకు హాజరైన ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు

**డి.హిర్రహాళ్ నవంబరు 18 ప్రభాతవార్త**

పరిశుభ్రతను పాటించి ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పించేందుకు ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు చేయూతనిస్తూ ముందుకు నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీవో దాస్ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం డి.హిరెహాళ్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీడీవో ఈవోపీఆర్డి యోగానంద ఆధ్వర్యంలో స్వచ్ఛ్ ఆంధ్రస్వర్ణాంధ్ర లో భాగంగా శుభ్రత పరిశుభ్రత పై సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ 16 పంచాయితీల్లో సర్పంచులు, ఉప సర్పంచ్లు, కార్యదర్శులు బాధ్యత వహించి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను శుభ్రంగా ఉంచి ప్రజాజీవనానికి ఆరోగ్యపరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడం వల్ల ప్రజలకు ఆరోగ్య పరమైన సమస్యలు అధిగమించి వృధా ఖర్చులను తగ్గించుకొని జీవనం సాగిస్తే ఆర్థికంగా బలపడతారని ఆసుపత్రులకు వెచ్చించే ధనం కుటుంబ ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగపడతాయని ఆయన శిక్షణలో పేర్కొన్నారు. పరిశుభ్రతను పాటించే విషయంలో ప్రజలను చైతన్యపరిచి పరిశుభ్రవంతమైన గ్రామాలుగా మార్చేందుకు మన అందరి వంతుగా భావించి సహకరిస్తూ ముందుకు సాగేందుకు కృషి చేద్దామని ఎంపీడీవో శిక్షణ తరగతులో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలనాధికారి బలరాంరావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశులు, జూనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి, కంప్యూటర్ ఆపరేటర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్యశాఖ రాష్ట్ర, ప్రాంతీయ అధికారుల పర్యటఆరోగ్య సేవల బలోపేతంపై ప్రత్యేక దృష్టి

**శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము) నవంబరు 18 ప్రభాతవార్త:**



సమావేశంలో చర్చిస్తున్న దృశ్యం

శ్రీ సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర మరియు ప్రాంతీయ స్థాయి వైద్య ఆరోగ్య శాఖాధికారులు శ్రీ సత్య సాయి జిల్లా డి ఎం అండ్ హెచ్ ఓ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రజా ఆరోగ్యము, కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన స్టేట్ ఆఫీసర్ డాక్టర్ కే. పద్మావతి, ఎన్ ఎల్ ఈ పి ఆఫీసర్ ఐడిఆర్ ఎస్. దేవసాగర్, ఎన్ పి సి డి జెడి డాక్టర్ బి. సునీల్ కుమార్ నాయక్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీ రామనాథ రావు, రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. అధికారులు అన్ని సెక్షన్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి శతజయంతి వేడుకలను విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లపై సూచనలు అందించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు అర్బన్ హాస్పిటల్లలో ప్రజల ఆరోగ్యంపై విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలనీ ఆదేశించారు. ప్రత్యేకంగా, గుడిబండ మండలంలోని జి.జి. హట్టి గ్రామంలోని మహిళలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అలాగే, లింగ నిర్ధారణ నిషేధంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు బేటి బచావో-బేటి పడావో అవేర్నెస్ కాంపెయిన్లను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం, అన్ని ప్రోగ్రాం ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## తెదేపా మండల కన్వీనర్ కు ఘన సన్మానం

**గుడిబండ నవంబర్ 18 ప్రభాతవార్త**



కన్వీనర్ ను సన్మానిస్తున్న ప్రకాష్

ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనరసప్పను సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, డైరెక్టర్ ప్రకాష్ లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ లక్ష్మీనరసప్ప తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడుగా ఎన్నికవ్వడం హర్షించదగ్గ విషయమని ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. అలాగే లక్ష్మీనరసప్ప మాట్లాడుతూ మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్న, లాయర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పచ్చదనం పరిశుభ్రత పై శిక్షణా తరగతులు

**: ఎంపీడీవో విజయ్ సింహ రెడ్డి**

**కనేకల్లు నవంబర్ 18 ప్రభాతవార్త**




ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో 18,19 మరియు 21 తేది లలోపచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇంచార్జి ఎంపీడీవో చంద్రమోళి అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయసింహారెడ్డి మాట్లాడుతూ ఈ మొదటి రోజు సర్పంచులకు ఉపసర్పంచులకు మరియు పంచాయతీ కార్యదర్శులకు పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. సదరు కార్యక్రమంలో అన్ని గ్రామాల యందు పరిశుభ్రత మరియు పచ్చదనం కార్యక్రమం పై అందరూ శ్రద్ధ పెట్టి గ్రామాలను ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేటట్లు చూడాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలోఎంపిడిఓ వి విజయ సింహా రెడ్డి, జిల్లా డి పి ఆర్ సి నుండి రిసోర్స్ పర్సన్ అఫ్జల్ భాషా మరియు డిప్యూటీ ఎంపీడీవో చంద్రమోళి మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులుపాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తురకలా పట్నం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు.

**రొద్దం. నవంబర్ 18 ప్రభాతవార్త.**



ఉపాధ్యాయులతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు.

మండల పరిధిలోని తురకల పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ క్రీడకు ఎంపికయ్యారు ఈ సందర్భంగా పిడి రామకృష్ణ తెలియజేస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్ డి టి క్రీడా మైదానం నందు అండర్ 17 బాల బాలికల కు సాఫ్ట్బాల్ పోటీలు నిర్వహించారని అందులో భాగంగా తురకల పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థులు బి ప్రణీత్ సాయి రాజ్ జి దీక్షిత్ రెడ్డి ఇద్దరూ బాలుర విభాగంలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయం రాష్ట్ర స్థాయి పోటీలు వెస్ట్ గోదావరి జిల్లా వీరవాసరం గ్రామంలో డిసెంబర్ 2 నుండి 4వ తారీఖు వరకు రాష్ట్రస్థాయి పోరీలు జరుగుతాయని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంగప్ప పాఠశాల సిబ్బంది విద్యార్థులు గ్రామస్తులు పాల్గొని హర్షం వ్యక్తం చేయడం జరిగింది

## విద్య ఎంత ముఖ్యమో క్రీడలు అంతే ముఖ్యం

**గ్రంథాలయ వారోత్సవాల్లో... జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జిఎం సురేష్.**

**గోరంట్ల నవంబర్ 18 ప్రభాత వార్త**



క్రీడా విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం.

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల లో భాగంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలోను మరియు జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం గోరంట్ల గ్రంథాలయం నందు జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రీ సత్య సాయి జిల్లా, రెడ్ క్రాస్ సంస్థ అధ్యక్షు డు జిఎం సురేష్ కమిటీ గౌరవ అధ్యక్షులు పారిశ్రామికవేత రామలింగారెడ్డి మాట్లాడుతూ జిఎం సురేష్ వారి ఫ్యామిలీ సేవా భావం గల కుటుంబమని అతని యొక్క సేవను భగవంతుడు గుర్తించి ఈ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కావడం చాలా ఆనందంగా ఉన్నదని సన్మానించారు. ఈ గ్రంథాలయమును అభివృద్ధికి మనము శాయశక్తుల కృషిచేసి మరిన్ని పుస్తకాలను తీసుకొని విద్యార్థినీ విద్యార్థులకు సహకారం అందిస్తానని పేద పిల్లలు కష్టపడి చదివి అభివృద్ధి కావాలని ఈ వేదిక నుంచి మీకు విన్నపము అన్నారు. అలాగే రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ జిఎం సురేష్ సినీ నిర్మాత గోరంట్ల మండలంలో రోహిత్ అనే అబ్బాయి హిందూపురం డిగ్రీ కాలేజీలో చదువుతూకూస్తీ పోటీలలో మన గోరంట్ల మండలాన్ని రాష్ట్రస్థాయిలో తీసుకువెళ్లి మన ఖ్యాతిని పెంచారని నేను ఎంతో గర్వపడుతూ ఆ అబ్బాయికి అన్ని విధాల సహకరిస్తానన్నారు. మా మండలానికి జాతీయస్థాయిలో వెళుతున్న రోహిత్ కు ఆ దేవదేవుని ఆశీస్సులు అన్నివేళలా ఉండాలని భగవంతుని కోరుతున్నానని జిఎం సురేష్ అన్నారు. రిటైర్డ్ ఎంఈఓ శ్రీరాములు మాట్లాడుతూ ఈ దేశ భవిష్యత్తు విద్యార్థుల్లోనే ఉన్నదని యువత క్రమశిక్షణగా ఉపాధ్యాయులు చెప్పినటువంటి పాఠ్యాలను శ్రద్ధగా చదివి వీలైన సమయంలో గ్రంథాలలకు వచ్చి మంచి మంచి కథలను కాంపిటీషన్ ఎగ్జామ్స్ లో ప్రిపేర్ అవడానికి మంచి వేదిక గ్రంథాలయం అన్నారు. రిటైర్డ్ ఎంఈఓ జయ చంద్ర రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాన్ని జిల్లాలో అత్యున్నతమైన స్థానం తీసుకువెళ్లి ప్రక్క జిల్లాల్లో గోరంట్ల మండలము పేరు ప్రఖ్యాతలు రాష్ట్ర స్థాయిలలో వెళ్లాలని వాటికి అన్ని విధాల మేము కృషి చేస్తామని పుర ప్రముఖులు కూడా తోడ్పాటు కావాలని రిటైర్డ్ ఆర్డీవో మరియు రెడ్ క్రాస్ సంస్థ సెక్రెటరీ విశ్వనాథ్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ భక్తవత్సలం కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎంఈఓ శ్రీరాములు కమిటీ అధ్యక్షులు అన్నపూర్ణ ఆదినారాయణ పాల్గొని విద్యార్థులను దుశాల్వాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్డీవో విశ్వనాథ్ మాట్లాడుతూ గ్రంథాలయాలు మనకెంతో ఉపయోగ పడుతున్నాయి వాటి లో గ్రంథాలు కవులు రచించిన పద్య లు గ్రంథాలయ వాటిలో ఉన్న సారాంశాలు మనకు ఎంతో ఉపయోగపడుతున్నాయి వాటిలో చరిత్రను తెలుసుకోవడానికి సమాజంలో జరుగుతున్న సమాచారం పత్రికలు ద్వారా అపారమైన తెలివితేటలను జ్ఞానాన్ని సంపాదించుకునే సరస్వతి దేవాలయం లాంటిది గ్రంథాలయం. విద్యార్థులు మీ రు జ్ఞానాన్ని అభివృద్ధి పరచుకునే విధంగా మీకు వీలైన సమయంలో గ్రంథాలయానికి వచ్చి మంచి మంచి పుస్తకాలు నీతికథలు,పద్య భాగము లో తాత్పర్యం అర్థం చేసుకోవాలి, కాంపిటీషన్ పుస్తకాలు చదివి జ్ఞానాన్ని అభివృద్ధి పరచుకొనే విధంగా ప్రయత్నం చేయండి అపారమైన జ్ఞానాన్ని సంపాదించి దేశ పురోగతికి అభివృద్ధి పడాలని అన్నారు. అభివృద్ధి కమిటీ కార్యదర్శి బైసాని శ్రీనివాస్ గుప్తా, సంయుక్త కార్యదర్శి రమేష్ బాబు కమిటీ గౌర సలహాదారుడు రిటైర్డ్ జయచంద్ర రెడ్డి కమిటీ కార్యవర్గ సభ్యులు రిటైర్డ్ ఉపాధ్యాయు లు నరహర మూర్తి వెంకటరమణ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గ్రంథాలయ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సృజనాత్మకత,ను పెంపొందించుకోవాలి.

**కొత్తచెరువు నవంబర్ 18 ప్రభాతవార్త.**

ప్రతి విద్యార్థి వారిలో దాగి ఉన్న సృజనాత్మకత నీ వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని గ్రంథాలయ అధికారి రమేష్ నాయక్ అన్నారు. మంగళవారం 58వ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖనం మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించారు ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో హెచ్ఎం శివయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ మరియు అన్నదాత సుఖీభవ అమోౌంట్ జమ.

**కొత్తచెరువు నవంబర్ 18 ప్రభాతవార్త.**

నేడు రైతులు ఖాతాల్లో అన్నదాత సుఖీభవ మరియు పీఎం కిసాన్ పథకం కింద ప్రతి రైతుకు అక్షరాల ఏడు వేల రూపాయలు మంజూరు అవుతుందని మండల వ్యవసాయ అధికారి సతీష్ బాబు తెలిపారు. నేడు మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల సమయంలో కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండలం చిన్న దాసరి పల్లి లో రెండో విడత అన్నదాత సుఖీభవ మరియు పిఎం కిసాన్ పథకం కింద రైతులకు 7000 రూపాయలు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుంది అందువల్ల రైతులు వర్చువల్ విధానంలో కొత్తచెరువు మండల పరిధిలోని పోతుల కుంట గ్రామం రైతు సేవ కేంద్రం నందు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడును ఈ కార్యక్రమానికి రైతు సోదరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ప్రజాప్రతినిధులకు పింఛన్ విధానం రద్దు చేయాలి
## - జేపీసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త
దేశ వ్యాప్తంగా ఉన్న మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ కు పదవి పూర్తి అయిన తరువాత వచ్చే పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ జేపీసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.
మంగళవారం విద్యార్థి జేపీసీ కార్యాల యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అమర్ యాదవ్ మాట్లాడు తూ.. సాధారణ ప్రభుత్వ ఉద్యోగులు, ఐఏఎస్, ఐపీస్, వంటి కీలక పదవు ల్లో నిర్వహించే వారికి ఎవరికి లేని విధంగా సౌభాగ్యాలు, రాజకీయ నాయ కులు పొందుతుండడం దురదృష్టకరమన్నారు.. మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ రంగంలో ఆరోగ్యకరమైన వాతావరణం కోసం కొన్ని రాజ్యాంగ సవరణలు తప్పనిసరిగా చేయాల్సిన అవసరం అనిపిస్తుంది అన్నారు. నిజానికి మాజీ ప్రజాప్రతినిధులకు పింఛన్ అవసరం లేదన్నారు. గుమ్మడి నర్సయ్య లాంటి పేద, నిజాయితీ నేతలకు పింఛను ఉండాలి. కొంతమంది నేతలు అయితే ఎంపీ, ఎమ్మెల్యేగా చేసిన నేతలు అయితే రెండు పింఛన్లు పొందుతున్నారు. జిల్లాలో అనంత వెంకటరామిరెడ్డి, నిమ్మల కిష్టప్ప, సినీ నటుడు చిరంజీవి ఇలాంటి కొంతమంది మాజీ ప్రజాప్ర తినిధులు ఏకంగా రెండు పింఛన్లు పొందుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంద మంది దోషులు తప్పించుకున్న పర్లేదు గాని ఒక నిర్దోషికి శిక్ష పడకూడదు అన్నారు. ఎవరైనా అభ్యర్థి ఒక ఎన్నికలలో ఒక నియోజకవర్గం నుంచి మాత్రమే పోటీ చేసేలా రా జ్యాంగ సవరణ చేయాలన్నారు. ప్రస్తుత రాజ్యాంగ వెసుల బాటు ప్రకారం ఒక అభ్యర్థి ఏకకా లంలో రెండు నియోజ కవర్గాలలో పోటీ చేయొచ్చు కానీ అతను రెండు చోట్ల గెలిస్తే ఏదో ఒకచోట ఉప ఎన్నిక వస్తుంది కనుక ప్రజాధనం వృధా కాకుండా ఒక అభ్యర్థి ఒకచోటే పోటీ చేసేలా రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు.


జేపీసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్

## 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో ఐదవ రోజు చిత్రాలేఖన పోటీలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త
58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో ఐదవ రోజు చిత్రాలేఖన పోటీలు నిర్వహజంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి రమ ఆధ్వర్యంలో నిర్వహించగా డిప్యూటీ లైబ్రరియన్ పి.కమ్మన్న, సహా గ్రంధాలయాధికారి డి.గోవిందు పర్యవేక్షించారు. రిటైర్డ్ టీచర్ శ్రీరాము లు, కళారత్న డాక్టర్ రామలింగ మయ్య, మహేష్ మొదలగు వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రరియన్ పి.కమ్మన్న, సహా గ్రంధాలయాధికారి డి.గోవిందు, సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ రాజు, రామాంజినమ్మ, జీఎమ్ బాషా, కిరణ్, జీవన, బాలచంద్ర, ఇందిరమ్మ, ఉజ్జనేశ్వరి, శివమ్మ, శిరీషా, గంగాధర్ మొదలగు వారు పాల్గొన్నారు.


పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం

## పార్టీ కోసం పని చేసాం ప్రాధాన్యతలు ఇవ్వండి

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త
అనంతపురం జిల్లా ఇన్చార్జి మంత్రి టీజీ భరత్‌ను కర్నూలులోని ఆయన కార్యాలయంలో కలిసి.వినతి పత్రం సమర్పించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇంచార్జ్ మార్కెట్ మహేష్.. ఈ సందర్భంగా మార్కెట్ మహేష్ శిరిశాల రాంబాబు మాట్లాడుతూ..2019లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి రాక్షస పాలనను తట్టుకొని నాలుగు సంవత్సరాల పాటు అనంతపురం నగరంలో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డాం, ఎన్నో కేసులు బనాయించినా వెన్ను చూపకుండా పార్టీ గెలుపుకై పనిచేసిన తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాకూడదని పనిచేసిన వారికి పదవులు వస్తున్నాయని, విచారించి వాస్తవాలు తెలుసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత నాయకులు యశ్వంత్ రాయల్, రుద్రంపేట పంచాయతీ ప్రధాన కార్యదర్శి వడ్డే మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఇన్చార్జ్ మంత్రి భరత్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న టిడిపి నాయకులు.

## స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త
స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో అత్యంత ప్రతిభ కనబరచి రైతులకు ఉపయోగపడే ఉత్తమ ప్రాజెక్టు " సౌర శక్తితో నడిచే పిచికారీ యంత్రం" ను తయారుచేసిన విద్యార్థినులను జిల్లా కలెక్టర్ అభినందించారు. స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ 2024-25లో జాతీ య స్థాయిలో పాల్గొన్న 72 వేల ప్రాజె క్టులలో తొలి వంద ప్రాజెక్టులలో స్థానం సంపాదించిన చీమలవాగుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అభినందించారు. తదుపరి రౌండ్ పరిశీలనలో పాల్గొనే ందుకు గాను డిఇఒ సూచనలతో స్థానిక సైన్స్ సెంటర్‌లో డిగ్రీ కళాశాల అధ్యాపకులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణకు హాజరైన విద్యార్థులు గౌరవ కలెక్టర్ వారిని కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారు ప్రాజెక్ట్ వివరాలు, వాటి ఉపయోగాలు పిల్లల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జోన్-4 నుండి ఎంపికైననేకైక్ ప్రాజెక్ట్ అని తెలుసుకుని విద్యార్థులను గైడ్ టీచర్‌ను అభినందించారు. తదుపరి పరీక్షల్లో కూడా నెగ్గి జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు, సమగ్రశిక్ష అదనపు సమన్వయకర్త శైలజా చౌదరి, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ, విద్యార్థినుల పాఠశాల ప్రధానోపా ధ్యాయు లు, సుబ్రహ్మణ్యం, ఫిజిక్స్ ఉపాధ్యాయులు, గైడ్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

## ప్రభుత్వ కళాశాలలో (అటానమస్) అడ్మిషన్లు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త
నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో బిఎస్సీ, బిఎ, బిబిఎ కోర్సులకు సంబంధించిన స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలియజేశారు. ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు సెక్షన్‌ను కానీ లేదా సంబంధి డిపార్ట్‌మెంట్లను ఈ నెల 21వ తేదిలోగా సంప్రదించవలసిందిగా కోరారు.

## ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త
58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి రమ అధ్యక్షతన పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనంతపురం డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, చైర్మన్ శ్రీ నెట్టెం వెంకటేష్, డిప్యూటీ డైరెక్టర్ అడల్ట్ ఎడ్యుకేషన్ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ కామర్స్ లెక్చరర్ మధుసూదన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో గ్రంధాలయాల యొక్క ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రతి ఒక్కరు గ్రంధాలయాలను ఉపయోగించుకొని మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని కోరారు. సెల్ ఫోన్ చూడడం మాని పుస్తక పఠనం పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంనకు హాజరైన పెద్దలను శాలువాతో సన్మానించడమైనది. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి రమ, డిప్యూటీ లైబ్రరియన్ పి కమ్మన్న, సహా గ్రంధాలయాధికారి డి గోవిందు, సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ రాజు, రామాంజినమ్మ, జీఎమ్ బాషా, కిరణ్, జీవన, బాలచంద్ర, ఇందిరమ్మ, ఉజ్జనేశ్వరి, శివమ్మ, శిరీషా, గంగాధర్ మొదలగు వారు పాల్గొన్నారు.

## నేడు అన్నదాత సుఖీభవ రైతుల ఖాతాల్లో జమ

బుక్కరాయసముద్రం నవంబర్ 18 ప్రభాతవార్త
బుక్కరాయసముద్రం మండలంలో పిఎం కిసాన్,అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా 2025=26 సంవత్సరానికి సంబందించి రెండవ విడత ఆర్థిక సహాయం అందించబడుతుందని మండల వ్యవసాయాధికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగ వారు మాట్లడుతూ మండలంలో లబ్దిదారుల రైతుల సంఖ్య7397 మందికి 1.48 కోట్లు ఈ పథకం ద్వారా అందజేయనున్నారు.నమోదు చేసిన ప్రతి అర్హత రైతు కుటుంబానకి సంవత్సరానికి మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందించబడుతోంది.రైతుల పంట దిగుబడులు మెరుగు పడటంలో పిఎం కిసాన్ పథకం ముఖ్య పాత్ర పోషిస్తోంది.లబ్దిదారుల రైతుల సంఖ్య 8657 మంది రైతులకు విడుదల చేయనున్న మొత్తం రూ,4.33 కోట్లు రైతు కష్టానికి ప్రభుత్వం బుక్కరాయసముద్రం మండలంలోని పెద్ద సంఖ్యలో రైతులకు నేరుగా నగదు సహాయం అందుతుంది,వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో ఈ పథకం కీలకంగా నిలుస్తోంది.ఈ పథకంద్వారా మండలంలోని రైతులకు రూ,5.81 కోట్లు పైగా నిధులు అందించడం జరుగుతుంది.

## కుష్టు వ్యాధి పై అవగాహన కల్పించాలి వైద్యాధికారి జయలక్ష్మి

బుక్కరాయసముద్రం, నవంబర్ 18 ప్రభాతవార్త
కుష్ఠు వ్యాధి పై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు.మంగళవారం బుక్కరాయ సముద్రం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.మండలంలో కుష్ఠు వ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని గూర్చి అడిగి తెలుసుకున్నారు.ఇంటింటా ప్రతి ఒక్కరికి ఈ వ్యాధి గురించి తెలియ జేయాలన్నారు.అనుమానిత లక్షణాలు ఉంటే వారిని గుర్తించి జిల్లా అధికా రులకు తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పిఎంఒ నాగన్న, డిపిఎం రామదాసు,మండల వైద్యాధికారి తేహరున్నిసా,కమ్యూనిటీ హెత్త్ ఆఫీసర్ మోహన్‌రావు,పబ్లికన హెల్త్ నర్స్ నాగలక్ష్మి,హెల్త్ ఎడ్యుకేటర్ ఫాతిమా, సూపర్వైజర్లు విజయలక్ష్మి,సత్యనారాయణశాస్త్రి,జానీరాజ్,ఫార్మసిస్టు ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు ధనుంజయ్య,వైద్య సిబ్బంది తదితిరులు పాల్గొన్నారు.


కుష్ఠు వ్యాధి పై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

## నేడు అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్
### - ఏఓ ఎన్.అన్వేష్‌కుమార్

శింగనమల, నవంబర్ 18 ప్రభాతవార్త
నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ నగదు వారి ఖాతాల్లో జమా చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్వేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ మండల వ్యాప్తంగా మొత్తం 8688 మంది రైతులకు 6.01 కోట్ల నగదు విడదల అవుతుందని, మధ్యాహ్నం మండల పరిధిలోని ప్రతి రైతు సేవా కేంద్రాల్లో ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం అవుతుందని, రైతులందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.


ఏఓ అన్వేష్‌కుమార్

## నేడే అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాలో జమ వ్యవసాయాధికారి విజయ్ జ్యోతికుమార్

ఆత్మకూరు నవంబర్ 18 ప్రభాతవార్త
కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టుతున్న పి,యం కిసాన్,అన్నదాత సుఖీభవ పథకం నిధులు బుధవారం రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి విజయ్ జ్యోతికుమార్ మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్నదాత సుఖీభవ పథకం 7281 మంది రైతులకు గాను రూ,3.64 కోట్లు,పియం కిసాన్ పథకంకు సంబంధించిన 7074 మంది రైతులకు రూ,1.41 కోట్లు నిధులు రైతుల బ్యాంక్ ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందని తెలియజేశారు.దీనికి సంబంధించిన కార్యక్రమాన్ని ప్రతి రైతు గ్రామంలో గల రైతు సేవా కేంద్రంలో ఉండే టీవీల ద్వారా ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.కావున రైతులందరూ రైతు సేవా కేంద్రంలో పాల్గోన్ని ప్రత్యక్ష ప్రసారంను సద్వినియోగం చేసుకోవాలని రైతును కోరారు.

## గ్రంధాలయాలు..విజ్ఞాన భాండాగారాలు

ఆత్మకూరు నవంబర్ 18 ప్రభాతవార్త
మండల కేంద్రంలో గల గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థిని,విద్యార్థులకు వ్యాస రచన,వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించడం జరిగింది.అనంతరం గ్రంధాలయ అధికారిని నల్లమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని,విద్యార్థులు గ్రంధాలయాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.గ్రంధాలయాలు విజ్ఞాన భాండాగారాలని,వీటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

## శ్రీ అంజినేయస్వామికి ప్రత్యేక పూజలు

అన్నదాన కార్యక్రమం నిర్వహించిన హనుమాన్ దీక్ష స్వాములు
ఆత్మకూరు నవంబర్ 18 ప్రభాతవార్త
అత్యంత భక్తి శ్రద్ధలతో హనుమాన్ దీక్షా తీసుకున్న స్వాములు కార్తీక మాసం చివరి వారం కావడంతో పి.యాలేరు గ్రామంలో గల అంజినేయస్వామికి ప్రత్యేక పూజలు మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సింధూరం,కుంకుమతో ప్రత్యేక అర్చనలు పూజలు నిర్వహించారు.హనుమాన్ దీక్షా స్వాములు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి, స్వాములు ఆలయంలో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.పూజా కార్యక్రమాలు అనంతరం స్వాములు వారు స్వామి వారి పూజలో పాల్గోన్న భక్తులకు,గ్రామ ప్రజలకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష స్వాములు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గోన్నారు.

## తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సన్మానించిన జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ బసంపల్లి రామాంజినేయులు.

అనంతపురం రూరల్ నవంబర్ 18 ప్రభాత వార్త చెన్నేకొత్తపల్లి మండలము బసంపల్లి గ్రామానికి చెందిన బసంపల్లి రామాంజినేయులు కు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా పదవి కేటాయించడంతో రాప్తాడు మాజీఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ని బసంపల్లి నాయకులతో కలిసి వెళ్లి మంగళవారం కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా బసంపల్లి రామాంజినే యు లుమాట్లాడుతూ వైఎస్ఆర్సిపి జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా తనకు అవకాశం కల్పించిన వైకాపా అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ కి,రాప్తాడు మాజీ ఎమ్మెల్యే,నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజే స్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ అధిష్ఠానం నన్ను గుర్తించి పదవి అప్పగించడంతో నిరంతరం కష్టపడుతు వైకాపా పార్టీని గ్రామస్థాయి నుంచి బలపేతం చేయుటకు తన వంతు బాధ్యతగ కృషి చేస్తానని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ, జిల్లాలో వైఎస్ఆర్ పార్టీ దళిత వర్గాలను ఒక తాటిపై తీసుకొని వస్తానని, దళితులకు పార్టీ తరపున అండగాఉంటామని,అధిష్టానం ఏ పనులు అప్పజెప్పిన కష్టపడి పనిచేయడానికి కృషి చేస్తూ,రాబోవు ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బసంపల్లి ఎస్సి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ని సన్మానం దృశ్యం.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి.

అనంతపురం రూరల్, నవంబర్ 18 ప్రభాత వార్త : అనంతపురం రూరల్ మండలం పాపంపేట గ్రామానికి చెందిన మేకల మల్లికార్జున గౌడ్ ( 41 ) రోడ్డు ప్రమాదం లో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృ తి చెందారు. కుటుంబ సభ్యులు తెలిసిన వివరాలు ఎలా ఉన్నాయి శనివారం రాత్రి 7 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై సిం గనమల నియోజ కవర్గం బండమీదపల్లి కి వెళుతుండగా శివపురం పెద్దమ్మ గుడి దాటి బండమీద పల్లి క్రాస్ వద్దకు రాగానే కుక్క అడ్డురావ దంతోతప్పించబోయే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోగా అంబులెన్స్ లో అనంతపురం సర్వజన ఆస్పత్రికి తీసుకురావడం జరిగింది. ఎడమ కాలు విరగడం మరియు తలకు గాయాలవ్వడంతో శనివారం రాత్రి నుంచి చికిత్స అందిస్తున్నారు తలకు గాయాలవ్వడం కారణంగా తలలో రక్తం గడ్డలు కట్టి స్పృహ కోల్పోయి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 11:30 నిమిషాల సమయంలో మృతి చెందడం జరిగిందని వారు తెలిపారు.


మృతి చెందిన మేకల మల్లికార్జున గౌడ్ ( ఫైల్ ఫోటో )

### గ్రంధాలయ మాజీ చైర్మన్ ఎల్.ఎం.మోహన్ రెడ్డి కి పెళ్లి కార్డు అందించిన.రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.

అనంతపురం రూరల్, నవంబర్ 18 ప్రభాతవార్త:తన సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి కూతురి ఈ నెల నవంబర్ 23న వివా హానికి రావాతరివిలాలంటూ గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎల్.ఎం.మోహన్ రెడ్డి కి రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజ కవర్గం సమన్వ యకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆహ్వాని ంచారు. వారి నివాసానికి వెళ్లిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వెడ్డింగ్ ఇన్విటేషన్ అందజేసి కుటుంబ సమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కోరారు.


:యల్ ఎం మోహన్ రెడ్డి దంప తులకు పెళ్లి కార్డు అందజేస్తున్న దృశ్యం

## ముత్యాలమ్మ గుడి మరమ్మతులకు ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ రూ.10,వేలు విరాళము.

అనంతపురం రూరల్, నవంబర్ 18 ప్రభాత వార్త:అనంతపురం అర్బన్ రుద్రంపేట ఎస్సీ కాలనీ లో ముత్యాలమ్మ గుడి మరమ్మతలకు ఎంఎస్ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి ఎంపీటీసీ మహబూబ్ బీ చేతుల మీదుగా ముత్యాలమ్మ ఆలయం కమిటీ మెంబర్లకు పదివేల రూపాయలు బ్యాంకు చెక్కును అందజేశారు. ఎంపీ టీసీ మహబూబ్ బీ మాట్లాడుతూ వైయస్సార్సీపి మాజీ శాసనసభ్యుడు అనంత వెంకట్రామిరెడ్డి రుద్రంపేట పంచాయతీ కు అభివృద్ధి పనులు మౌలిక సదుపాయాలు ప్రజలందరికీ ఎక్కువగా చేశారు. మసీదులకు, దేవాలయాలకు, ఆయన ఎంతో అభివృద్ధి చేశారు. అనంత వెంకటరామిరెడ్డి అభివృద్ధి చేశాడు కాబట్టి మంగళవారం రుద్రంపేటలో మేము ప్రజల వద్దకి వెళ్ళగలుగుతున్నాం, రోడ్లు అయితేనేమి, డ్రైనేజీలు అయితేనేమి, కల్వర్టులు, బ్రిడ్జిలు, కోట్లతో అభివృద్ధి చేశారు కనుక ఆయన స్ఫూర్తితో రుద్రంపేటలో ప్రజలకు అభివృద్ధి పనులు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాము. అనంత వెంకట్రామిరెడ్డి ఆశీర్వాదంతో ఎల్లప్పుడూ రుద్రంపేట పంచాయతీ ప్రజానీకానికి సేవలు చేస్తామని గర్వంగా తెలియజేస్తున్న న్నారు. కార్యక్రమంలో ఎమ్మెస్ సేవా సంస్థ అధ్యక్షులు మరియు వైఎస్సార్సీపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సాదిక్ వలి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ముత్యాలమ్మ గుడి మర మ్మ తులకు ఆర్థిక సహాయం గా బ్యాంక్ చెక్కును అందజేస్తున్న దృశ్యం.

### పంచాయతీలను వందశాతం క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలి.. డిడివో నాగశివలీల. డిప్యూటీ ఎంపీడీవో వెంకటనాయుడు

అనంతపురము రూరల్, నవంబర్ 18 ప్రభాతవార్త: క్రమం తప్పకుండా ఇంటింటి చెత్త సేకరణ, పారిశుద్య పనులు, మొక్కల పెంపకం చేపట్టి గ్రామ పంచాయతీలను క్లీన్ అండ్‌గ్రీ న్‌గాతీర్చిదిద్దడానికి ప్రతి పం చాయ తీ కార్యదర్శి, సర్పంచ్‌లు ప్రత్యేక చొరవ చూపాలని డిడివో నాగశివలీల, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు తెలిపారు. మం గళవారం అనంతపుర ము మం డల పరిషత్ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమంలో క్లీన్ అండ్ గ్రీన్‌పై మొదటి రోజు శిక్షణా తరగతులు డిప్యూడి ఎంపీడీవో వెం కటనాయుడు అధ్యక్షతనప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథులుగా డిడివో నాగశివలీల, ఎంపిపి వరలక్ష్మి, ఈటిసి రాష్ట్ర అబ్జర్వర్ జెకె రెడ్డిలు హాజరయ్యారు. డిడివో నాగశివలీల మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి, పరిశుభ్రత కోసం ప్రభుత్వం నిర్దేంచిన విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, సర్వేలు ఎప్పుటికప్పుడు పూర్తి చేసి... యాప్‌లో పొందుపరచాలని సూచించారు. మండలంలో ఒక పంచాయతీని మోడల్‌గా ఎంపిక చేసుకుని.. ఆ పంచా యతీపై ప్రత్యేక దృష్టి సారించి.. ప్రణాళిక లను పకడ్బందీగా అమలు చేసి.. వందశాతం ఫలితాలు సాధించి... ఆదర్శ ంగా నిలపాలని సూచిం చారు. రాష్ట్ర అబ్జర్వర్ కెజె రెడ్డి మాట్లాడుతూ పారిశు ద్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ, మొక్కల పెంపకంపై మంచి పలితాలు రావడానికి అనుసరిం చాల్సిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడు తున్న డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు

### గోవింద్‌రెడ్డి సొంత ఖర్చుతో...స్వగ్రామ రోడ్డుకు మరమ్మతులు

గోరంట్ల, నవంబర్ 18 ప్రభాతవార్త
గోరంట్ల మండలం కొండాపురం పంచాయతీ కాంగారెడ్డిపల్లికి వెళ్లే రహదారి కంపచెట్లు పెరిగి మూసుకుపోవడంతో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందిగా ఏర్పడిందని భావించిన గ్రామవాసి టిడిపి నేత గోవింద్‌రెడ్డి సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతుకు శ్రీకారం చుట్టారు. ఐతే విషయాన్ని గ్రామస్తులు కంగారెడ్డిపల్లి గోవింద్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో సొంత ఖర్చు కంప చెట్లను తొలగింపు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగార్జున రెడ్డి ఉత్తంరెడ్డి, నరేషరెడ్డి, ఈశ్వనాథరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఈశ్వరెడ్డి, శేఖరెడ్డి, ఈశ్వర్, సాయికుమార్ మరియు కాంగారెడ్డిపల్లి గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు.

## విద్యార్థిని విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు

నంబులపూలకుంట, నవంబర్ 18 ప్రభాతవార్త
నంబులపూలకుంట శాఖా గ్రంధాలయంలో మంగళవారం 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా అధికారిణి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు తెలుగు టీచర్ వెంకట్రా ంరెడ్డి, ఎస్.వహీదా వ్యాసరచ న క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల వలన విద్యార్థిని విద్యార్థులకు చిన్నతనం నుండి పోటీ తత్వం అలవడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రరియన్ తెలుగు టీచర్లు వెంకట్రాంరెడ్డి, వాహిదా మేడం, విద్యార్థిని విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి గ్రంధాలయ వారోత్సవాల చివరి రోజున 20వ తేదిన బహుమతులు ప్రదానం చేయబడునని తెలియజేశారు.


ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

### తరిమెల వంశీ గోకుల్ రెడ్డిని వివాహ వేడుకకు ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్

శింగనమల, నవంబర్ 18 ప్రభాతవార్త
వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర రైతు విభాగం కార్య దర్శి తరిమెల వంశీగోకుల్‌రెడ్డిని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కలిసి తన సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి కూతురు వివాహం ఈ నెల 23వ తేదిన జరుగుతున్నందున ఈ వివాహ వేడుకకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా హాజరైన నూతన వధువరులను ఆశీర్వదించాలని ఆయన కోరారు.


వివాహ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దశ్యం

## విద్యారణ్య సమస్యలను పరిష్కరించండి
### - ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాచేపల్లి సూర్య ప్రకాష్

శింగనమల, నవంబర్ 18 ప్రభాతవార్త
నియోజకవర్గ వ్యాప్తంగా అనేక గ్రామాల్లో విద్యా రంగ సమస్యలు ఉన్నా యని ఆ సమస్యలన్నింటినీ భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుర్తించి మీ ముందుకు తీసుకొచ్చామని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్య ప్రకాష్ శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతిపత్రం అందించారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపిసి గ్రూపులను ఏర్పాటు చేయాలని విద్యార్థులకు మంచి నీరు, టాయిలెట్స్ సదుపాయం కల్పించాలన్నారు. ప్రహ రీ గోడలేని పాఠశాలలకు ప్రహరీగోడలను నిర్మించాలన్నారు. కాస్మో టిక్‌చార్జీలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సాయి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

## నాగన్న కుటుంబానికి అండగా వైఎస్ఆర్‌సిపి
### - సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బొమ్మన శ్రీరామిరెడ్డి

శింగనమల, నవంబర్ 18 ప్రభాతవార్త
వైఎస్ఆర్‌సిపి కార్యకర్త సాకే నాగన్న కుటుంబానికి అండగా వైఎస్ఆర్‌సిపి ఉంటుందని, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాయినవారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి కార్యకర్త సాకే నాగన్న అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి సాకే నాగన్న ఇంటికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు. ఈ సందర్భంగా ఆయన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ.. ధైర్యంగా ఉండాలని వైఎస్ఆర్‌సిపి అండగా ఉంటుందని భరోసా కల్పించారు.


సాకే నగన్న పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్న బొమ్మన శ్రీరామిరెడ్డి

### 13వ రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి..!
### - పోస్టర్స్ విడుదల చేసిన రైతుసంఘం నాయకులు..!

రాప్తాడు, నవంబర్ 18 ప్రభాతవార్త
ఈనెల నవంబర్ 27, 28 జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 13వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి పోతలయ్య జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి పెద్దన్న, మారెప్ప తెలిపారు. మంగళ వారం మండల కేంద్రంలోని ఎంపీడిఒ కార్యా లయం ఆవర ణంలో పోస్టర్స్ విడుదల చేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్, జిల్లా రైతు సంఘం నాయకులు, జిల్లా నలుమూలల నుండి రైతు ప్రతినిధులు పాల్గొంటారని ఈ మహాసభలో జిల్లాలోని రైతాంగ సమస్యలపై తీర్మానా లుఆ మోదించడంతోపాటు నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందని చెప్పారు. జిల్లాలో రైతాంగ సమస్యలపై రైతు సంఘం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిందని, ఫలితంగా అనేక రైతాంగ సమస్యలు పరిష్కారం అయ్యాయని అన్నారు ప్రధానంగా జిల్లాలో సాగునీటి సమస్య పరిష్కారానికి జలా గ్రహ దీక్ష 24 గంటల పాటు నిర్వహించడం జరిగింది పంట నష్టపరి హారం కోసం పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉరవకొండ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు పాదయాత్ర నిర్వహించి కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నాలు చేయడం జరిగింది, 544డి రోడ్డు నిర్వాసితుల సమస్యలు కోసం పోరాటం చేసి నిర్వాసితులకు పరిహారం ఇచ్చేంతవరకు పోరాటం చేసాం నాసిరకం పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇన్సూ రెన్స్ ,టమోటా రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని , జిల్లాలో బలవంతపు భూసేకరణ ఆపాలని పోరాటం చేయడం జరిగింది పండ్ల తోటల రైతుల ఎదుర్కొంటున్న ప్రధానంగా చీని మార్కెట్ యార్డ్ లో ఈనామ వ్యవస్థ రద్దుచేసి వేలంపాట ద్వారా అమ్మకాలు జరపాలి సూటు విధానం అరికట్టాలి, అరటి మొక్కజొన్న మిరప రైతులు సమస్యలపై పోరాటాలు చేసింది అని తెలిపారు. ఈ మహాసభలో జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. 27న జరుగు 13వ రైతు సంఘం మహా సభకు రైతులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయ కులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

## నరెద్దుల రాజాకు...అంతర్జాతీయ కళావేదిక కమిటీలో ఛాన్స్
### - జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోరంట్ల వాసి నరెద్దుల రాజారెడ్డి ఎన్నిక

గోరంట్ల, నవంబర్ 18 ప్రభాతవార్త
గోరంట్ల మండలానికి చెందిన రచయిత నరెద్దుల రాజారెడ్డి రచనా ప్రతిభను గుర్తించి అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక తరపున జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. అంతర్జాతీయ సాహిత్య సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక శ్రీసత్యసాయి జిల్లా నూతన కమిటీలో భాగంగా ఆ సంస్థ సిఈఓ కళారత్న కత్తిమండ ప్రతాప్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరెద్దుల రాజారెడ్డిని నియమించడం జరిగింది. భవిష్యత్తులో జరగబోయే సాహిత్య కార్యక్రమాలను మండల స్థాయిలో విరివిగా జరపడం జరుగుతుందని తెలియచేశారు. ఈ సంస్థ తరపున నిరంతరం కవితా పోటీలు, కవి సమ్మేళనాలు, కవితా గోష్ఠి, పుస్తక ఆవిష్కరణలు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తుంటారన్నారు. శ్రీశ్రీ కళావేదిక దాదాపు ముప్పై ఐదు ప్రపంచ రికార్డులు సాధించి వేదికగా ప్రసిద్ధి చెందినదని నిర్వాహకులు తెలియపరిచారు. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతను కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరిపురుషోత్తంనాయుడు. జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం నరెద్దుల రాజారెడ్డి సాహిత్య సేవలకు గాను స్పందించి జిల్లా శ్రీశ్రీ కళావేదిక ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేస్తూ ప్రశంసా పత్రం ప్రదానం చేయడం జరిగింది.


**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా మా కక్షీదారుడయిన టి.నరసయ్య తండ్రి టి.సి.నరసింహులు, నివాసం D.No : 28/3/475 శారద నగర్, 1వ క్రాస్, అనంతపురం అనువారు ఈ క్రింది షెడూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దాస్తావేజు నెం.48/2000 తేది : 08-06-2000 ఎల్.ఎస్.రాజష్ తండ్రి ఎల్.విఠల్‌దాస్, కమలానగర్, అనంతపురం గార్ల పేరుతో ఉన్న జి.పి.ఎ పత్రములు శారదానగర్ మెయిన్ రోడ్ నందు జిరాక్స్ సెంటర్‌కు పోవుచుండగా పోగొట్టుకొనిపోయినవి. కాబట్టి ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ జి.పి.ఎ ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రసుకు నాకు గాని, నా క్లయింట్ కు గానీ 7 రోజుల లోపల తెలియచేయగలరు.

**షెడ్యూలు**

అనంతపురం రి.డి. అనంతపురం సబ్.డి కి చేరిన కక్కలపల్లి గ్రామ పొలంలోని ఆస్తి వివరం.
**బాబు : స॥ ఖుష్కి, సర్వేనెం : 7,** ఎ.సి 14.26 పైకి ఎ.సి- 0.10 హెచ్.ఎస్ : 0.040 ప్లాట్ నెంబర్ : 24,25 గల ప్లాట్లు.

P.L.Eswar Reddy, Advocate, Anantapuramu. Cell : 9490979003

**CHANGE OF NAME**

I, SALMAN SHAIK MOHAMMED [OLD NAME] S/O HANEEF SHAIK MOHAMMAD H.NO.16-11-16/E, TIPPU KHAN STREET HINDUPUR -515201 SRI STHIYA SAI DISTRICK [A P] CHANGING MY NAME FROM SALMAN SHAIK MOHAMMED [ OLD NAME] TO **SALMAN SHAIK MOHAMMAD** [ NEW NAME ] HENCE FORTH I AM BEING CALLED AS **SALMAN SHAIK MOHAMMAD** FOR ALL PURPOSES

